క్లుప్తంగా

దారి సాకు..
ఆలయ మొక్కల తొలగింపు



ఆలయం వద్ద తొలగించిన అరటి, పూల మొక్కలు

నగరి : మున్సిపల్ పరిధిలోని అనంతప్ప నాయుడు కండ్రిగ వద్ద అయ్యప్ప ఆలయం ఆవరణలో ఉన్న అరటి , పూల మొక్కలను దారి సాకుతో టీడీపీ నేతలు తొలగించేశారు. ఆలయం వద్ద చెట్లు తొలగించరాదని తాము చెప్పడంతో ఉద్దేశపూర్వకంగా చెట్లను తొలగించారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఆరోపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై అక్కసు ప్రదర్శిస్తూ వచ్చిన వారు నేడు ఆలయాలు, దేవుళ్లపై కూడా అక్కసు ప్రదర్శిస్తున్నారని విమర్శించారు.

సాగునీటి సంఘం
ఓటరు జాబితా ప్రదర్శన

విజయపురం : సాగునీటి సంఘాల ఓటరు జాబితాను విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ ఏఈ ప్రశాంత్ తెలిపారు. మండలంలో మొత్తం 12 సాగునీటి సంఘాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. సంఘాల పరిధిలో ఓటరు జాబితా రూపొందించినట్లు చెప్పారు. ఆయకట్టు కింద ఉన్న సర్వే నంబర్ల వారీగా జాబితాను నవీకరించామన్నారు. ఓటరు జాబితాను ఆయా సచివాలయల పరిధిలో అందుబాటులో ఉంచి , నోటీసు బోర్డుపై ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. ఏదైన మార్పులు, చేర్పులు ఉంటే రెండు రోజుల్లో తెలియజేయాలని కోరారు.

ఇంటింటికీ వెళ్లి పింఛన్ల పంపిణీ



నగదు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే థామస్

గంగాధర నెల్లూరు : జీడీ నెల్లూరు పంచాయతీ పరిధిలోని మోతరంగనిపల్లెలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ ఇంటింటికి వెళ్లి పింఛన్ పంపిణీలో భాగస్వాములయ్యారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు స్వామి దాస్, దేవ సుందరం, వెంకటేష్, జ్యోతి రెడ్డి, శ్రీధర్ యాదవ్, హరీష్ యాదవ్, పుష్పరాజ్, రాంబాబు రెడ్డి తోపాటు ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

కార్యదర్శులకు
ఈ నెల జీతం లేనట్టే ..!

విజయపురం : మండల అధికారులు చేసిన తప్పిదంతో 9 మంది కార్యదర్శులకు అక్టోబర్ నెల జీతం అందలేదు. వేతనాలు చూసే అధికారి సరిగా మ్యాపింగ్ చేయకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొందని కార్యదర్శులు బయటకు చెప్పలేక మదనపడుతున్నారు. విజయపురం మండలంలో గ్రామ, సచివాలయాల్లో మొత్తం 16 మంది పంచాయతీ కార్యదర్శులు పని చేస్తున్నారు. ఇందులో ఏడుగురు గ్రేడ్–5, ఇద్దరు గ్రేడ్– 4 కార్యదర్శులకు ఈ నెల జీతాలు అందకపోవడంతో దీపావళి పండుగకు చేతులు చిల్లిగవ్వ లేక పండుగను ఆనందంగా జరుపుకోలేకపోయారు.

ఇన్‌చార్జి ఎస్‌ఈగా
చంద్రశేఖరరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా పంచాయతీ రాజ్ ఎస్‌ఈగా పీఆర్‌ఐ ఈఈ చంద్రశేఖరరెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్‌ఈ శంకరనారాయణ గురువారం ఉద్యోగ విరమణ పొందడంతో ఆ స్థానంలో ఈఈకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. త్వరలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

పేదల పక్షపాతి ఏఐటీయూసీ



జెండా ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: పేదల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ 105 ఏళ్లుగా పోరాటాలు చేస్తోందని ఆ యూనియన్ జిల్లా గౌరవఅధ్యక్షుడు నాగరాజన్ తెలిపారు. నగరంలోని గాంధీవిగ్రహం వద్ద ఘనంగా ఏఐటీయూసీ 105వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. కార్మికుల హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తే కార్మిక వర్గం సహించదన్నారు. ఎర్రజెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి తినిపించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సమావేశంలో 1,40,000 మంది కార్మికులు సుమారు 150 అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారని చెప్పారు. 8 గంటల పని కోసం కార్మికుల పోరాటం కొనసాగించి సాధించారన్నారు. అనేకమంది అశువులు బాసిన అనంతరం 8 గంటల పని విధానాన్ని సాధించిన ఘనత దేశంలోనే మొదటి సంఘం తమదని కొనియాడారు. అప్పటి నుంచి కార్మికుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం, ప్రైవేట్ యాజమాన్యంతో పోరాటం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

అభివృద్ధికి దూరం..

అవస్థలతో భారం



రైల్వే శాఖ ప్రహరీ నిర్మించడంతో కుచించుకుపోయిన అక్కేరి రోడ్డు

ప్రభుత్వాలు మారుతున్నా పల్లె ముఖచిత్రాల్లో మార్పు కనిపించడంలేదు.తద్వారా ప్రజల బతుకుల్లో ఆశించిన మార్పు రావడంలేదు. నేటికి 78 స్వాతంత్య్ర వేడుకలు జరుపుకున్నా ఇంకా కొన్ని పల్లెలకు సరైన రహదారి సౌకర్యాలు లేకపోవడం పాలకులకు సిగ్గుచేటు. దేశానికి వెన్నెముక అయిన పల్లెల్లో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో పల్లె జనం నిత్యం నరకయాతన పడుతున్నారు. ఇలాంటి దుస్థితి వేపగుంట పంచాయతీలోని అక్కేరి దళితవాడలో నేటికీ సరైన రోడ్డు మార్గం లేకపోవడం విస్మయానికి గురిచేస్తోంది.

- అక్కేరిలో కనీస సౌకర్యాలు కరువు
- మాజీ మంత్రి రోజా చొరవతో గ్రావెల్ రోడ్డు ఏర్పాటు
- ప్రభుత్వం మారడంతో సీసీ పనులకు బ్రేక్

పుత్తూరు : దశాబ్దాలు గడుస్తున్నా అక్కేరి దళితవాడలో మౌలిక సదుపాయాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. పుత్తూరు రూరల్ మండలం వేపగుంట పంచాయతీ పరిధిలోని అక్కేరి దళితవాడలో వంద కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వేపగుంట నుంచి అక్కేరికి వెళ్లాలంటే నిత్యం అవస్థలు తప్పడం లేదు. ఇటీవల రైల్వేశాఖ చెన్నై– విజయవాడ మధ్య వందే భారత్ రైళ్లను నడుపుతోంది. ఈ నేపథ్యంలో ప్రమాదాల నివారణలో భాగంగా రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా ప్రహరీ నిర్మిస్తున్నారు. అక్కేరి గ్రామం రైల్వే ట్రాక్‌కు ఆనుకొని ఉండడంతో గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గం మరింత కుంచించుకుపోయింది. ఇటీవల వర్షాలకు రోడ్డు బురదమయం కావడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మాజీ మంత్రి చొరవతో గ్రావెల్ రోడ్డు ఏర్పాటు : వేపగుంట నుంచి అక్కేరి దళితవాడకు వెళ్లాలంటే గతంలో కేవలం కాలిబాట మాత్రమే ఉండేది. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోని అప్పటి మంత్రి రోజా ప్రజల విన్నపం మేరకు ముందుగా గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేసి సహకరించారు. ఆపై సీసీ రోడ్డు సైతం ఏర్పాటుకు రైల్వే అధికారుల నుంచి అనుమతులు పొందారు. ఇందుకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మారడంతో సీసీ రోడ్డు పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. ప్రస్తుతం ఉన్న గ్రావెల్ రోడ్డు చిన్నపాటి వర్షానికి బురదమయం అవుతుండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అత్యవసర సమయాల్లో 108, 104 వాహనాల రాకపోకలు సాధ్యపడడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇకనైన ప్రజాప్రతినిధులు , అధికారులు చొరవ తీసుకొని సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు వెడల్పు చేయాలి



మా గ్రామానికి దారి లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇది వరకు ఉన్న రోడ్డుకు ఆనుకొని రైల్వే అధికారులు ప్రహరీ నిర్మించడంతో రోడ్డు మరింతగా కుంచించుకుపోయింది. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అధికారులు రోడ్డును వీలైనంత వెడల్పు చేసి సిమెంట్ రోడ్డు వేయాలి.

– ప్రతాప్‌కుమార్, అక్కేరి దళితవాడ, వేపగుంట.

108, 104 వాహనాలు రావడం లేదు



మా గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో 108, 104 వాహనాలు రావడం లేదు. అలాగే ఆటోలు కూడా రావడానికి ఇబ్బందిగా ఉంది. అత్యవసర పరిస్థితిలో ఆసుపత్రికి వెళ్లాలంటే కష్టాలు తప్పడం లేదు. అధికారులు వెంటనే స్పందించి సీసీ రోడ్డు వేయాలి.

– శేఖర్, అక్కేరి దళితవాడ, వేపగుంట.

ట్యాంక్ ఆవరణ పరిశుభ్రం



ట్యాంక్ చుట్టూ పిచ్చి మొక్కలను తొలగించిన దృశ్యం

విజయపురం (వడమాలపేట) : వడమాలపేట మండలం ఎస్‌బీఆర్‌పురం దళితవాడలోని ఓవర్ హెడ్ ట్యాంక్ చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను సిబ్బంది తొలగించారు. సాక్షిలో బుధవారం 'నీళ్ల ట్యాంక్ చుట్టూ పిచ్చి మొక్కలు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి పిచ్చి మొక్కలను తొలగించారు. దీంతో గ్రామస్థులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

విద్యుత్ స్తంభానికి
అల్లుకున్న తీగల తొలగింపు



పిచ్చి మొక్కలను తొలగించిన విద్యుత్ సిబ్బంది

విజయపురం (వడమాలపేట) : వడమాలపేట మండలం ఎస్‌బీఆర్ పురం దళితవాడ మెయిన్ రోడ్డుపై విద్యుత్ స్తంభానికి అల్లుకున్న పిచ్చి మొక్కలను సిబ్బంది తొలగించారు. సాక్షిలో బుధవారం 'అల్లుకున్న నిర్లక్ష్యం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించి పిచ్చి మొక్కలను తొలగించారు.దీంతో స్థానికులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై
అప్రమత్తత అవసరం



కాళికాపురంలో వైద్య పరీక్ష నివేదికను పరిశీలిస్తున్న డాక్టర్ విష్ణుప్రియ

విజయపురం : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యురాలు విష్ణుప్రియ సూచించారు. శుక్రవారం కాళికాపురం సచివాలయంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలంలో మలేరియా, డెంగీ, గన్యా, టైఫాయిడ్, డయేరియా, అతిసార వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు. వర్షపు నీటిని నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు.

గొంతెండుతున్న కాళికాపురం

విజయపురం : మండలంలోని కాళికాపురం బీసీ కాలనీలో నాలుగు రోజులుగా తాగునీరు లేక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ మోటార్ మరమ్మతుకు గురై నాలుగు రోజులైనా ఇంత వరకు అధికారులు పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే మోటారుకు అమర్చిన స్టార్టర్ కూడా కనిపించడం లేదని వాపోతున్నారు. దీంతో తాగునీటి కోసం వ్యవసాయ బోరు బావుల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. మండల స్థాయి అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని, కనీసం గ్రామంలో చేతిపంపు లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు విద్యుత్ మోటార్‌ని మరమ్మతు చేసి తాగునీరు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బొగ్గు లారీలో మంటలు.. తప్పిన ప్రమాదం



లారీ నుంచి వస్తున్న మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

విజయపురం (వడమాలపేట) : బొగ్గు తీసుకెళుతున్న లారీ టైర్ పేలడంతో మంటలు చెలరేగాయి. అగ్నిమాపకశాఖ అధికారులు సకాలంలో వచ్చి మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ సంఘటన వడమాలపేట మండల పరిధిలోని అంజెరమ్మ కనుమలో గురువారం చోటు చేసుకుంది. పుత్తూరు అగ్నిమాపకశాఖ అధికారి నేతాజీ కథనం మేరకు తమిళనాడు నుంచి బొగ్గును తీసుకెళుతున్న లారీ టైరు అంజేరమ్మ కనుమ వద్ద పేలి మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న పుత్తూరు అగ్నిమాపక శాఖ అధికారి నేతాజీ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని మంటలను పూర్తిగా ఆర్పివేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పిందని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది రామస్వామి, మనోజయ్య, శరత్ బాబు, శ్రీధర్, బాల నరసింహులు పాల్గొన్నారు.

పుత్తూరులో గౌరీ వ్రతాన్ని ఆచరిస్తున్న మహిళలు, గంగాధర నెల్లూరు : అల్లిఎల్లమ్మ ఆలయంలో గౌరీ వ్రతంలో మహిళలు, వెదురుకుప్పం : పచ్చికాపల్లంలో నోములు







వెలుగుల పండుగ..

ఆనందాలు నిండుగా

దీపావళి పండుగను నియోజకవర్గంలో వైభవంగా జరుపుకున్నారు. యువత పెద్ద ఎత్తున టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. అలాగే పలు ఆలయాల్లో భక్తి శ్రద్ధలతో గౌరీ వ్రతం నోములు ఆచరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నగరిలో మాజీ మంత్రి రోజా కుటుంబ సభ్యులతో కలిసి టపాసులు కాల్చి సందడి చేశారు. దీపావళి కాంతులు అన్ని కుటుంబాల్లో వెలుగులు నింపాలని రోజా ఆకాంక్షించారు.

– నగరి/పుత్తూరు/పాలసముద్రం/ గంగాధర నెల్లూరు/వెదురుకుప్పం/విజయపురం



నగరి : కుటుంబ సభ్యులతో కలిసి టపాసులు కాలుస్తున్న మాజీ మంత్రి రోజా





శ్రీకావేరిరాజుపురంలో చిచ్చుబుడ్లు వెలిగిస్తున్న యువకులు, విజయపురంలో టపాసులు కాలుస్తున్న చిన్నారులు

పురవీధుల్లో ఊరేగిన వేణుగోపాలుడు



ఊరేగింపునకు సిద్ధంగా ఉన్న ఉత్సవ మూర్తుల విగ్రహాలు

కార్వేటినగరం : వేణుగోపాలస్వామి ఆలయంలో దీపావళి ఆస్థానం వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామున స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి మూల విరాట్‌కు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ ఆవరణలోని ఊంజల్ మండపం వద్ద ఆస్థాన వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను అలంకరించి తిరుచి వాహనంపై ప్రతిష్ఠించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.



అప్పలాయగుంట ప్రత్యేక అలంకరణలో ఉభయదేవేరులతో ప్రసన్న వేంకటేశ్వరుడు

అప్పలాయగుంటలో..

విజయపురం (వడమాలపేట) : వడమాలపేట మండలం అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో దీపావళి ఆస్థానాన్ని వైభంగా నిర్వహించారు. గురువారం దీపావళి పండుగ సందర్భంగా సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలకు ఆభరణాలు, పట్టువస్త్రాలు, పూలమాలలతో అలంకరింపజేశారు. అనంతరం ఉభయ దేవేరులతో ప్రసన్నవేంకటేశ్వర స్వామి వారు మాడ వీధుల్లో ఊరేగారు. కార్యక్రమంలో ఆలయ అధికారి శివకుమార్, ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్సీని అమలు చేయాలి

నగరి : టీడీపీ కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పీఆర్సీ అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండన్, సహ అధ్యక్షుడు మునిరత్నం డిమాండ్ చేశారు. స్వర్ణోత్సవాలు విజయవంతం చేయాలని సంఘం నేతలు స్థానిక పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమావేశమయ్యారు. నగరి, నిండ్ర, విజయపురం మండలాల కౌన్సిల్ నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి, సహ అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఈ నెల 3, 4వ తేదీల్లో పూతలపట్టులో నిర్వహించే యుటీఎఫ్ స్వర్ణోత్సవాలను, 17వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎస్పీ బాష, జిల్లా కార్యదర్శి పార్థసారథి, రచనల కమిటీ కన్వీనర్ బాలాజీ, కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు చంద్రయ్య, కుప్పరాజు, మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి

విధుల్లో నిరక్ష్యం వహిస్తే చర్యలు : డీఎంహెచ్‌ఓ

శ్రీరంగరాజపురం : మండలంలోని ఆరిమాకులపల్లి , శ్రీరంగరాజపురం ఆరోగ్య కేంద్రాలను చిత్తూరు జిల్లా వైద్యాధికారి ప్రభావతి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది విధుల్లో నిరక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం రోగులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. తనిఖీలో డాక్టర్ గిరి, సందీప్‌రాజు , బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, గౌరి ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి ప్రభావతి

చెత్త నుంచి సంపద తయారీతో ఆదాయం

పాలసముద్రం : గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చెత్త నుంచి సంపద తయారీపై అధికారులు శ్రద్ధ పెట్టి పంచాయతీకి ఆదాయం పెంచుకోవాలని చిత్తూరు ఎఫ్‌టీసీ , డీపీఆర్ జేమ్స్ తెలిపారు. శుక్రవారం శ్రీకావేరిరాజుపురంలో గ్రీన్ అంబాసిడర్లు గ్రామాల్లో పర్యటించి తీసుకొస్తున్న చెత్తను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా జేమ్స్ మాట్లాడుతూ.. చెత్త సేకరణతో గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తీరటంతో పాటు చెత్త నుంచి సంపద తయారు చేస్తే పంచాయతీకి ఆదాయం సమకూరుతుందని పేర్కొన్నారు. గ్రీన్ అంబాసిడర్ల ద్వారా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయాలన్నారు.



చెత్త నుంచి సంపద సృష్టిపై గ్రీన్ అంబాసిడర్లకు వివరిస్తున్న జేమ్స్

చిన్ననోటు.. పెద్దకష్టం

- మార్కెట్లో తగ్గిన రూ.10 నోట్ల చెలామణి
- ఇబ్బంది పడుతున్న వ్యాపారులు, ప్రజలు



పది రూపాయల నోట్లు

నగరి : పది రూపాయల నోటు చిన్నదే అయినా ప్రతి ఒక్కరికీ చాలా అవసరం. అయితే ప్రస్తుతం మార్కెట్లో లభించడం లేదు. ఇప్పటికే చలామణిలో ఉన్న చిరిగిన, బాగా దెబ్బతిన్న నోట్లు తప్ప కొత్తవి రావడం లేదు. మార్కెట్లో నడుస్తున్న రూ.10 నోట్లు జేబులో పెట్టుకుంటే చిరిగిపోయే స్థితిలో ఉన్నాయి. మార్కెట్లో రూ.10 నోటు కనిపించడం గగనంగా మారుతోంది. దీంతో నియోజకవర్గంలో వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 1 ,2, 5, 10 రూపాయల నాణేలు గతంలో చెలామణిలో ఉండేవి, ధరల పెరుగుదలతో 1, 2, 5 రూపాయల నాణేలు ఉన్నా 5 రూపాయాల నాణెం వినియోగం పెరిగిపోయింది. 10 రూపాయల నాణెం ఉన్నా పెద్దగా చలామణిలో ఉండడం లేదు. ప్రస్తుతం ఆయా నాణేలతో పాటు రూ.10 నోట్ల చెలామణి భారీగా తగ్గింది. చిరువ్యాపారుల మొదలు కూరగాయలు, దుకాణాలు, హోటళ్లు, టీకొట్లు మొదలుకొని ఆటోలు, బస్సుల్లో రూ.10 నోటుకు ప్రాధాన్యం పెరిగింది. పది నోట్లు అందుబాటులో లేక వ్యాపారులు ఇక్కట్లకు గుర వుతున్నారు. చిరు వ్యాపారుల వద్ద రూ.100 నోటు ఇస్తే వ్యాపారులు తిరిగి చిల్లర ఇచ్చేందుకు నానా తంటాలు పడాల్సి వస్తోంది. డిజిటల్ చెల్లింపుల్లో యూపీఐ సర్వర్లపై భారం పడి పనిచేయని సమయంలో ఆయా మండలాల వ్యాపారులు, ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోంది.

పోలీసు సంస్మరణ ర్యాలీ..!



పోలీసు అమర వీరుల కోసం క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం చిత్తూరులో ర్యాలీ నిర్వహించారు. స్థానిక గాంధీ విగ్రహం నుంచి ఎస్పీ మణికంఠ చందోలు క్యాండిల్ ర్యాలీ ప్రారంభించారు. శాంతి భద్రతలను కాపాడుతూ విధి నిర్వహణలో ప్రాణ త్యాగం చేసిన పోలీసుల సేవలు మరువలేనివని ఎస్పీ అన్నారు. వారిని స్మరిస్తూ గత పది రోజులుగా జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలను సైతం భాగస్వామ్యం చేశామన్నారు. పోలీసు విధులకు ఎలాంటి కళంకం తీసుకురాకుండా సిబ్బంది విధులు నిర్వర్తించాలని ఎస్పీ ఆకాంక్షించారు. మేళ తాళాల మధ్య పోలీసులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.